



ఆదివారం రత్నాచల్ రైలు వద్ద ప్రయాణికుల రద్దీ

# క్రికెట్ బుకీల్లో వైసీపీ నేత?



- ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు
- మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సైబర్‌క్రైమ్ పోలీసులు
- తూర్పు వైసీపీ నేత ప్రమేయం ఉన్నట్టు గుర్తింపు
- అతని బ్యాంకు ఖాతా నుంచి భారీగా లావాదేవీలు జరిగినట్టు అనుమానం

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కలకలం రేపుతున్న క్రికెట్ బెట్టింగ్ ముఠా కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పెదవాల్తేరు డాక్టర్స్‌కాలనీ గాయత్రి టవర్స్‌లోని ఒక ఫ్లాట్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఈనెల 12న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి బుకీని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. విచారణలో రాబట్టిన వివరాల మేరకు కొంత మంది ముఠాగా ఏర్పడి పెద్దఎత్తున బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు తేలడంతో సీపీ శంఖబ్రతబాగ్చి కేసు దర్యాప్తును సైబర్‌క్రైమ్ పోలీసులకు అప్పగించారు.

దర్యాప్తు ప్రారంభించిన సైబర్‌క్రైమ్ పోలీసులు బెట్టింగ్ ముఠా సుమారు 80 బ్యాంకు ఖాతాల నుంచి రూ.176 కోట్లు లావాదేవీలను చేసినట్టు గుర్తించారు. ఆ ఖాతాల్లో ఉన్న రూ.45 లక్షలను ఫ్రీజ్ చేసి, మరో ముగ్గురు బుకీలను అరెస్టు చేశారు. కాగా బెట్టింగ్ ముఠాలో కొంతమంది బుకీలు, సహకరించిన వారు ఉన్నట్టు తేలడంతో వారికోసం గాలింపు చేపట్టారు. బుకీలకు సహకరిస్తున్న ముగ్గురిని శనివారం అరెస్టు చేయగా, మరో ఇద్దరిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారని సమాచారం. వీరిలో ఒకరు కొబ్బరితోటకు చెందిన రౌడీషీటర్ కాగా మరొకరు ఇసుకతోటకు చెందిన వ్యక్తిగా తెలిసింది. వీరిద్దరూ ఇచ్చిన సమాచారంతోపాటు, బుకీలు నిర్వహించిన, బెట్టింగ్ వేసిన వారి బ్యాంకు ఖాతాలను పరిశీలించగా తూర్పు నియోజకవర్గానికి చెందిన ఓ వైసీపీ నేత కీలకంగా వ్యవహరించినట్టు తెలిసింది. దీతో ఈ నేత బ్యాంకు ఖాతాకు ఎక్కడెక్కడి నుంచి ఎంతమొత్తం వచ్చింది, ఆ ఖాతా నుంచి ఎవరెవరి ఖాతాలకు నగదు బదిలీ జరిగిందననే దానిపై పూర్తిసమాచారం రాబడుతున్నట్టు తెలిసింది. ఇదిలా ఉండగా ఇటీవల సస్పెండ్ అయిన హెడ్‌కానిస్టేబుల్ బుకీలకు సహకరించడంతో పాటు అతని బ్యాంకు ఖాతా నుంచి బెట్టింగ్ లావాదేవీలు జరిగినట్టు గుర్తించారని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఒక ఫ్లాట్ కేంద్రంగా నడుస్తున్న బెట్టింగ్ మాఫియాలో పోలీసులు, రాజకీయ నేతలు ఉండడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

# స్టాఫ్ నర్సు పోస్టులకు పైరవీలు

**ప్రజాప్రతినిధుల సిఫారసులు**

- ఇప్పటివరకు 20 మంది లేఖలు తెచ్చినట్టు సమాచారం

అధికారులకు నేరుగా ఫోన్లు చేయిస్తున్న అభ్యర్థులు

- తల పట్టుకుంటున్న ఆరోగ్య శాఖ యంత్రాంగం
- ఇదే అదనుగా రంగంలోకి దళారులు
- పోస్టుకు రేటు కట్టి బేరసారాలు
- మెరిట్ ప్రాతిపదికగానే నియామకాలుంటాయన్న అధికారులు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ ప్రక్రియ అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. 106 పోస్టుల భర్తీకి 8,300 మంది దరఖాస్తు చేశారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా పోస్టు దక్కించుకునేందుకు కొంతమంది అభ్యర్థులు పైరవీలకు తెరతీశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల సిఫారసు లేఖలతో అధికారులను కలుస్తున్నారు. మరికొందరు నేరుగా ప్రజాప్రతినిధులతో ఫోన్లు చేయిస్తున్నారు. ఇప్పటివరకు 20 మంది అభ్యర్థులు సిఫారసు లేఖలతో అధికారులను సంప్రదించగా, మరో పది మంది ఫోన్లు చేయించినట్టు తెలిసింది.



ఆర్డీ కార్యాలయంలో దరఖాస్తు చేసేందుకు వచ్చిన అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-1) పరిధి (ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం)లో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీచేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 17 వరకు సాగిన ప్రక్రియలో 8,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే, ఒక్కో పోస్టుకు 78 మంది మధ్య పోటీ నెలకొంది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్‌లో ఖాళీగా ఉన్న 72 పోస్టులను, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా 34 పోస్టులను భర్తీ చేస్తామని ఆర్డీ పి.రాధారాణి తెలిపారు.

## నియామక ప్రక్రియ ఇలా...

దరఖాస్తు గడువు ముగియడంతో అధికారులు వడపోత ప్రారంభించారు. మెరిట్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేస్తామని ఆర్డీ వెల్లడించారు. మార్కులకు 75 శాతం, కరోనా, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేసిన వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. ఈ నెల 26న నాటికి తుది జాబితాను సిద్ధం చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. ఈ నెల 29న తుది జాబితా ప్రదర్శిస్తామని, 30, 31 నాటికి నియామక పత్రాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతో ఉమ్మడి జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధుల నుంచి అధికారులపై ఒత్తిడి వస్తోంది. నగర పరిధిలోని ఇద్దరు ఎమ్మెల్యేలు ఆరుగురు అభ్యర్థులకు సిఫారసు చేయగా, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ నేత ఇద్దరికి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత ఇద్దరికి సిఫారసు లేఖలు ఇచ్చారు. దీంతో అధికారులు తల పట్టుకుంటున్నారు.

## రంగంలోకి దళారులు

ఆరోగ్యశాఖలో నియామక ప్రక్రియ ఎప్పుడు జరిగినా దళారులు రంగంలోకి దిగుతుంటారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి అభ్యర్థుల నుంచి పోస్టుకు రేటు కట్టి వసూలు చేస్తుంటారు. తాజా నియామక ప్రక్రియలోనూ

... మిగతా 6వ పేజీలో

# రైళ్లకు తగ్గని రద్దీ

- పోటెత్తిన సంక్రాంతి తిరుగు ప్రయాణికులు
- కిటకిటలాడిన ప్లాట్‌ఫామ్‌లు.. కిక్కిరిసిన కోచ్‌లు
- జాతరను తలపించిన విశాఖ రైల్వే స్టేషన్

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్ జాతరను తలపించింది. ప్రయాణికులు పోటెత్తడంతో ప్లాట్‌ఫామ్‌లు కిటకిటలాడాయి. రైళ్లన్నీ కిక్కిరిసి నడిచాయి. ఉదయం 6.20 గంటలకు బయలుదేరే జన్మభూమి, 7.10 గంటలకు బయలుదేరే సింహాద్రి నుంచి మొదలైన తాకిడి రాత్రి 11.20 గంటలకు బయలుదేరే ఎల్‌టీటీ వరకు కొనసాగింది. కేవలం సికింద్రాబాద్ రైళ్లకే కాకుండా చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్, హౌరా, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల రైళ్లన్నీ కిక్కిరిసి పోయాయి.

## కిక్కిరిసిన రత్నాచల్

విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల పోటెత్తారు. ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్ జనసంద్రంగా మారింది. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేవారంతా రైలు సమయానికి గంట ముందుగానే స్టేషన్‌కు చేరుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది అప్రమత్తమై ప్రయాణికులను క్రమపద్ధతిలో రైలు ఎక్కించేందుకు ఆపసోపాలు పడ్డారు. రైలు ప్లాట్‌ఫామ్ మీదకు చేరిన



తర్వాత నియంత్రణ లోపించడంతో కోచ్ ప్రవేశద్వారాల వద్ద తోపులాట జరిగింది. కొందరు కిటికీల నుంచి లోపలికి ప్రవేశించేందుకు యత్నించారు. ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చిన నిమిషాల్లోనే వచ్చిన ప్రయాణికులు దిగడం, ఇక్కడి వారు లోపలికి వెళ్లడం జరిగిపోయాయి. చిన్నపిల్లలు, వృద్ధులతో ఉన్న వారు జనరల్ కోచ్‌ల్లోకి వెళ్లేందుకు సాహసం చేయలేక రిజర్వేషన్ కోచ్‌లను ఆశ్రయించారు. దీంతో రిజర్వేషన్ బోగీలు సాధారణ కోచ్‌లను తలపించాయి.

## అన్ని రైళ్లకు అదే రద్దీ

విద్యాలయాలకు సంక్రాంతి సెలవులు ముగియడం, పండగ ముగియడంతో ప్రయాణికులతో రైళ్లన్నీ

... మిగతా 6వ పేజీలో

# స్క్రాప్ దుకాణాలపై జీవీఎంసీ దృష్టి

**భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని గుర్తింపు**

- జనవాసాలు, దుకాణాల మధ్యలోనే గోదాములు
- అగ్ని ప్రమాదం జరిగితే భారీ నష్టం తప్పదని ఆందోళన
- నోటీసులు జారీచేయాలని కమిషనర్ ఆదేశం
- త్వరలో తుక్కు వ్యాపారులతో సమావేశానికి కసరత్తు



వన్‌టౌన్ ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం ఎదురుగా వున్న స్క్రాప్ దుకాణాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో స్క్రాప్ (తుక్కు) దుకాణాల్లో భద్రతపై జీవీఎంసీ అధికారులు దృష్టిసారించారు. ఎక్కడికక్కడ జనావాసాలు, దుకాణాల మధ్యలోనే స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేయడంతో అప్రమత్తమయ్యారు. స్క్రాప్ దుకాణాల్లో త్వరగా మండే స్వభావం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు, గ్యాస్ కలిగిన వస్తువులు ఉండడంతో ప్రమాదం జరిగితే ఊహించనంతగా నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో స్క్రాప్ దుకాణాల్లో భద్రతాప్రమాణాలు పాటించేలా ముందస్తు చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో దాదాపు 200 స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల్లోని నిరుపయోగ వస్తువులు, యంత్రాలను వీటిలో విక్రయిస్తుంటారు. ఇందులో ప్లాస్టిక్, రబ్బరు, రాగి, సీసం, కంచు వంటి వాటితో పాటు వివిధ రకాల వాయువులు నిల్వ ఉంచే ట్యాంకులు, సిలిండర్లు వుంటాయి. వీటిని గోడౌన్‌లకు తీసుకెళ్లి అక్కడ ప్లాస్టిక్‌ను కంప్రెస్ చేసి బండిల్‌గా



మారుస్తున్నారు. ఇనుము, గ్యాస్ సిలిండర్లు ట్యాంక్‌లను యంత్రాలతో ముక్కలుగా చేసి, కంప్రెషర్ సాయంతో బండిల్ చేస్తారు. ఆ సమయంలో సిలిండర్లు, ట్యాంక్‌ల్లో వాయువులు ఉండిపోతే పేలుడు సంభవించే అవకాశం ఉంటుంది. అలాగే పొరపాటున అగ్నిప్రమాదం జరిగితే గోడౌన్‌లోని ప్లాస్టిక్

... మిగతా 6వ పేజీలో

# రేషన్ పంపిణీలో ఇష్టారాజ్యం!



వన్‌టౌన్ పూర్ణామార్కెట్ సమీపంలో పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్ ఫొటో)

**డీలర్లు, ఎండీయూ వాహన డ్రైవర్లదే పెత్తనం**

- పోర్టబిలిటీ ద్వారానే 60 నుంచి 80 శాతం బియ్యం పంపిణీ
- ఆ ప్రాంతాలకే అందుబాటులో వాహనాలు
- డిపో, కార్డుదారుల మ్యాపింగ్‌కు మంగళం
- ఎండీయూ వాహనాల్లోనే అక్రమ రవాణా
- నిర్వీర్యమైన చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థ

విశాఖపట్నం/మహారాణిపేట/జగదాంబ కూడలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

నిరుపేదలకు రేషన్ పంపిణీలో డీలర్లు, ఎండీయూ వాహనాల డ్రైవర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. నిబంధనలను తమకు అనుకూలంగా మలచుకుని, బియ్యాన్ని వెంటనే విక్రయించే ప్రాంతాలకు ముందుగా సరఫరా చేసి, ఆ తరువాత మిగిలిన వారికి అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఎండీయూ వాహనాల్లోనే అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**రేషన్ డిపో నంబరు 0386153:** కార్డులు 437. శుక్రవారం సాయంత్రం వరకు బియ్యం తీసుకున్న కార్డుదారులు 303 మంది. వారిలో డిపో చుట్టుపక్కల ఉన్నవారు 11 మంది మాత్రమే. పోర్టబిలిటీ కింద బియ్యం తీసుకున్నవారు 292 మంది.

**రేషన్ డిపో నంబరు 0386262 :** కార్డుల సంఖ్య 832. శుక్రవారం సాయంత్రం వరకు బియ్యం తీసుకున్న కార్డుదారుల సంఖ్య 794. వీరిలో డిపో చుట్టుపక్కల ఉన్నవారు 179. పోర్టబిలిటీ కింద బియ్యం తీసుకున్నవారు 615 మంది.

రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యానికి బదులుగా డబ్బులు తీసుకునే వారిని ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలకు వాహనాలను పంపి వేలిముద్రలు తీసుకుంటున్నారు. వన్ నేషన్.. వన్ రేషన్ విధానాన్ని ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. అదే సమయంలో డిపో చుట్టుపక్కల ఉన్న కార్డుదారులకు పంపిణీ చేయడం లేదు. పోర్టబిలిటీలో ఒక డిపోలో ఎంతమందికైనా బియ్యం అందజేయవచ్చుననే విధానంతో చాలాకాలంగా బియ్యానికి బదులు సొమ్ములు అందజేస్తున్నారు. రేషన్ పంపిణీని పర్యవేక్షించాల్సిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా డీలర్లు/ఎండీయూల నుంచి నెలవారీమామూళ్లకు పరిమితమవుతున్నారు. పూర్ణామార్కెట్‌లో

... మిగతా 6వ పేజీలో

# కుదేలైన ప్రాథమిక పాఠశాలలు

**గత వైసీపీ సర్కారు నిర్వాకం**

- జీవో 117తో ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విలీనం
- దీంతో జిల్లాలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కొక్క విద్యార్థే
- రెండుచోట్ల ఇద్దరు, నాలుగు పాఠశాలల్లో ముగ్గురే
- 54 పాఠశాలల్లో పది మంది లోపే విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

నాడు-నేడు, విద్యాదీవెన వంటి పథకాలతో పాఠశాల విద్య పురోగతి సాధించిందని వైసీపీ పాలకులు చెప్పిన గొప్పలు క్షేత్రస్థాయిలో బూటకమని తేలిపోయింది. దేశంలో మరెక్కడా లేని విధంగా మూడు, నాలుగు, ఐదు తరగతులకు సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం కోసం తెచ్చిన జీవో నంబరు 117తో ప్రాథమిక పాఠశాలలు కుదేలయ్యాయి. మూడేళ్ల క్రితం తీసుకువచ్చిన ఈ జీవోతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

జిల్లాలోని 11 మండలాల పరిధిలో మండల/ప్రభుత్వ, మునిసిపాలిటీ యాజమాన్యాలకు సంబంధించి 447 ప్రాథమిక పాఠశాలలున్నాయి. పెదగంట్యాడ మండలం మరడదానరిపేట, ఆనందపురం మండలం దబ్బంది ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి చదుతున్నారు. ఆనందపురం మండలం దిబ్బమీదపాలెం, గొల్లలపాలెం పాఠశాలల్లో ఇద్దరేసి విద్యార్థులున్నారు. విద్యార్థి ఒక్కరే ఉన్నా టీచర్ని నియమించారు. జిల్లాలో నాలుగు పాఠశాలల్లో ముగ్గురు, తొమ్మిది పాఠశాలల్లో నలుగురు, ఆరు చోట్ల ఐదుగురు, మూడు చోట్ల ఆరుగురు, రెండు పాఠశాలల్లో ఏడుగురు విద్యార్థులు, ఎనిమిది చోట్ల ఎనిమిది, ఐదుచోట్ల తొమ్మిది, పది పాఠశాలల్లో పది మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 54 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పది కంటే తక్కువగా ఉంది. ఇంకా 78 ప్రాథమిక పాఠశాలల్లో 11 నుంచి 20 మంది, 116 పాఠశాలల్లో 21 నుంచి 30 మంది, 122 పాఠశాలల్లో 31 నుంచి 60 మంది, 78 పాఠశాలల్లో 61 నుంచి 120 మంది విద్యార్థులున్నారు. మిగిలిన పాఠశాలల్లో 121 కంటే ఎక్కువగా విద్యార్థులున్నారు.



పెదగంట్యాడ మండలం మురుబాయి ప్రాథమిక పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులకే బోధిస్తున్న ఉపాధ్యాయిని

## తరగతుల విలీనంతో ప్రభావం

జీవో 117 అమల్లోకి రావడంతో కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి ఐదు తరగతులను ఉన్నత పాఠశాల్లో విలీనం చేశారు. దీంతో

... మిగతా 6వ పేజీలో


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి నేత్రపర్వంగా అర్జితనిత్యకల్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాల పూజలు చేశారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు జరిపి మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యధారణలు, అక్షితారోపణలు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## స్వామి వివేకానంద యువజన వారోత్సవాల ముగింపు

పద్మనాభం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గోస్నానీ విద్యా పీఠ్ అవరణలో నెహ్రూ యువ కేంద్రం, శ్రీగాయంత్రి వెల్ఫేర్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద యువజన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ సీహెచ్ శ్రీధర్ విచ్చేశారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవా జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ వాయు నందనరావు, బీజేపీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక నేత చెల్లూరి చిరస్మరణీయుడు

తగరపువలస, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కార్మిక నాయకుడు చెల్లూరి అప్పారావు కార్మికుల కోసం సేవలు మరువలేనివని సీపీఐ నాయకులు కొనియాడారు. కానూరి రాంబాబు అధ్యక్షతన ఆదివారం అప్పారావు సంస్మరణ సభ నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలితరం కమ్యూనిస్టు నాయకులలో అప్పారావు ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అప్పలరాజు, మావూరి వీర్రాజు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## అతిగా మద్యం సేవించడంతో వ్యక్తి మృతి


మృతుడు సూరిబాబు

ఎండాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పాటు అతిగా మద్యం సేవించడం వల్ల ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రుషికొండలోని ఐటీ సెజ్ ప్రాంతంలో వీపీఆర్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాల ప్రాంతానికి సూరిబాబు అనే వ్యక్తి ఈ నెల 12న వచ్చాడు. పనులు లేక ఇబ్బంది పడుతున్నానని, తనకు ఎవరూ లేరంటూ సైట్ సూపర్‌వైజర్ కర్రి వీరనాగ సతీశ్ కుమార్‌ను పని ఇవ్వాలని కోరాడు. అయితే ప్రస్తుతం సెలవుల వల్ల పనులు లేవని, లేబర్ కోసం కేటాయించిన షెడ్డులో ఉండమని ఆయన తెలిపారు. పండగ ముగిశాక సూపర్‌వైజర్ షెడ్డు వద్దకు వచ్చి చూడగా తాను జ్వరంతో బాధ పడుతున్నానని సూరిబాబు చెప్పడంతో ఆయన కొంత నగదును ఇచ్చారు. ఆ నగదుతో సూరిబాబు అతిగా మద్యం సేవించాడు. దీంతో సమీపంలోని వైద్యుని వద్దకు ఆయనను తీసుకువెళ్లారు. సూరిబాబు పచ్చకామెర్లతో బాధ పడుతున్నట్టు వైద్యులు తెలిపారు. కాగా అతిగా మద్యం సేవించడం వల్ల ఆదివారం సూరిబాబు మృతి చెంది ఉన్నాడు. మృతుని వివరాలు తెలియరాలేదు. సతీశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయితో నలుగురి అరెస్టు

ఎండాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొమ్మాదిలో గంజాయి కలిగివున్న నలుగురు వ్యక్తులను పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమ్మాది ఏపీహెచ్‌బీ కాలనీ రోడ్డులో ఉన్న రఘు వైన్స్ పక్కన ఆదివారం కొందరు గంజాయితో ఉన్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కొమ్మాదికి చెందిన ఎల్.భాస్కరరావు, టేకు రాజేశ్, శివాజీపాలేనికి చెందిన దుర్గామోహన్‌తో పాటు మరో వ్యక్తి రాంబాబు నుంచి 1,200 కిలోల గంజాయి ప్యాకెట్లతో పాటు మూడు సెల్ ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం

ఎండాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మధురవాడ బక్కన్నపాలెంలోని సాయి టవర్స్‌లో ఉంటున్న ఎస్‌కే చాంద్ బాషా అనే వ్యక్తి కనిపించడం లేదని పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి టవర్స్‌లో చాంద్‌బాషా (45) భార్యఫాతిమాతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈ నెల 11 నుంచి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బాషా ఎక్కడికో వెళ్లిపోయారు. ఆయన కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో ఫాతిమా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- గుడిలోవలో డాక్టర్ హెడ్గెవార్ ఆస్పత్రి ప్రారంభం


గుడిలోవలో డాక్టర్ హెడ్గెవార్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఆనందపురం జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆదివారం గుడిలోవ విజ్ఞానవిహార ఆవరణలో డాక్టర్ హెడ్గెవార్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ క్రమంలోనే త్వరలో గ్రామాల్లో ప్రతి ఇంటికి, ప్రతి మనిషికి వైద్య పరీక్షలు అందిస్తామన్నారు. అవసరమైతే వైద్య సేవలు అందజేయనున్నట్టు చెప్పారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు సీవీ రావు మాట్లాడుతూ మానవ జీవనశైలిలో వచ్చిన పెను మార్పుల వలన అధిక రక్తపోటు, మధుమేహం వంటివి చిన్న వయస్సులోనే వస్తున్నాయన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ కార్యకారిణి సభ్యులు బాగయ్య మాట్లాడుతూ మన వ్యవసాయ సాగులో రసాయనిక ఎరువులు తగ్గించి గో ఆధారిత సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు గ్రామాల్లోనే ఉపశమనం లభించే ఆరోగ్య కేంద్రాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీలు

కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ అధ్యక్షుడు పీవీ నారాయణరావు, కార్యదర్శి జి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.వెంకటప్పడు, అఖిల భారత విద్యా భారతి అధ్యక్షుడు, విజ్ఞాన విహార డైరెక్టర్ దూసి రామకృష్ణారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రికి ఆర్ఎంపీల వినతి

ఆరోగ్య కేంద్రం ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

తగరపువలస, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తగరపువలస వై జంక్షన్‌లో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని అన్నారు. స్టీలుప్లాంటులో వీఆర్ఎస్‌ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న 5 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ కమిటీ నాయకులు ఆర్.నర్సింగరావు మాట్లాడుతూ రైతు, కార్మిక ఉద్యమాలను అణచి వేయడం కేంద్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. దీనికి ఫలితం అనుభవించడం తథ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతోందంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, బి.లక్ష్మి, సీఐటీయూ నాయకులు నీలాతి రాము, జోగ ఆనంద్, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మహావిశాఖ అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో ఆదివారం దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నక్కాన ఆనంద కుమార్‌కు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం కలిపించి శేషవస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

## పరిశుభ్రత అందరి బాధ్యత : కార్పొరేటర్ మంగమ్మ


మహాత్మా గాంధీ పార్కులో శ్రమదానం చేస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని జీవీఎంసీ 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ పేర్కొన్నారు. మిథిలాపురి వుడా కాలనీ కర్వేల్ లే అవుట్‌లో ఉన్న మహాత్మాగాంధీ పార్కులో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలతో కలిసి ఆమె శ్రమదానం చేశారు. పార్కులో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. జీవీఎంసీ శానిటరీ సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# సందర్శకులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకోం

- భీమిలి బీచ్ ఫొటోగ్రాఫర్లను హెచ్చరించిన సీఐ సుధాకర్


బీచ్ ఫొటోగ్రాఫర్లకు సూచనలిస్తున్న సీఐ సుధాకర్

భీమునిపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులు, సందర్శకులతో ఫొటోగ్రాఫర్లు మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని భీమిలి సీఐ బి.సుధాకర్ సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో బీచ్ ఫొటోగ్రాఫర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి భీమిలి బీచ్‌కు విచ్చేసే సందర్శకుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తే భీమిలికి ఉన్న మంచిపేరు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల అందరూ మంచి నడవడికతో ఉండాలన్నారు. శనివారం భీమిలి తీరానికి వచ్చిన ఓ జంట పట్ల కొందరు బీచ్ ఫొటోగ్రాఫర్లు ఇబ్బందికరంగా ప్రవర్తించినట్టు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు అందిందన్నారు. ఈ క్రమంలో సీఐ వారికి గట్టిగా క్లాస్ పీకారు. భీమిలి బీచ్, కొబ్బరితోట బీచ్, రామాద్రి బీచ్, వారిజ బీచ్‌ల వద్ద సుమారు 80 మంది ఫొటోగ్రాఫర్లు ఉపాధి పొందుతున్నారు. ఇంకోసారి సందర్శకులు ఇబ్బంది పడినట్టు ఫిర్యాదులు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరించారు. అలాగే తీరంలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.హరీశ్ పాల్గొన్నారు.

## సాగర తీరాల్లో సండే సందడి

సాగర్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రుషికొండ సాగర తీరం ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించింది. మధ్యాహ్నం నుంచే బీచ్‌కు సందర్శకుల తాకిడి మొదలైంది. సెలవు రోజు కావడంతో నగరవాసులతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో సందర్శకులు బీచ్‌కు వచ్చారు. రుషికొండ బీచ్ దక్షిణ రహదారిలో ఉన్న హిల్ వ్యూ నుంచి సముద్ర అందాలను తిలకిస్తూ ఆహ్లాదకరంగా గడిపారు.


కళకళలాడుతున్న భీమిలి సాగరతీరం


సందర్శకులతో సందడిగా కనిపిస్తున్న రుషికొండ బీచ్ రుషికొండ

హిల్ వ్యూ మార్గంలో బీచ్‌ను తిలకించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడంతో ఈ రహదారి కార్లతో నిండిపోయింది. చిన్నారులతో పాటు యువతీ యువకులు ఉల్లాసంగా సముద్ర స్నానాలు చేశారు.

**భీమునిపట్నం:** భీమిలి సాగరతీరం సందర్శకులతో కిటకిటలాడింది. సాయంత్రం సుదూర ప్రాంతాలనుంచి సందర్శకులు పెద్దసంఖ్యలో తరలి రావడంతో తీరంలో సందడి వాతావరణం నెలకొంది. కడలి కెరటాల చెంత అత్యధికులు సరదాగా జలకాలాడారు. ఇసుకతిన్నెలపై చిన్నారులు, యువత ఆడుకుని ఆనందంగా గడిపారు.

## పరమపదవాసుడిగా అప్పన్న దర్శనం



సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తులకు పరమపదవాసునిగా దర్శనమిచ్చారు. సాయంత్రం పవళింపు సేవ తర్వాత ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి బంగారు తొళ్లక్కియాన్‌లో అధిష్ఠింపజేశారు. మహిళల కోలాటాలు, ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలవనలు, పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. దారి పొడవునా పలువురు భక్తులు ఫలాలు, కర్పూర నీరాజనాలను స్వామికి సమర్పించారు. అనంతరం నాలాయిర దివ్యప్రబంధ పారాయణలు జరిపి భక్తులకు తీర్థగోష్ఠి జరిపారు.

## సింహాచలేశున్ని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామిని ఆదివారం విశాఖ 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు, అనకాపల్లి జిల్లా చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు దర్శించుకున్నారు. ఏఈవో ఎన్.ఆనందకుమార్ వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం తర్వాత అంతరాలయంలో వారి పేరిట అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.


కప్పస్తంభం వద్ద గణబాబు

## రెవెన్యూ సదస్సుల్లో 749 వినతులు స్వీకరణ

పద్మనాభం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 749 వినతులు వచ్చినట్టు తహసీల్దార్ కె.ఆనందరావు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 325 సమస్యలను పరిష్కరించామన్నారు. మిగిలిన 424 వినతులలో మ్యుటేషన్‌కు చెందినవి 282 దరఖాస్తులు, సర్వేకు చెందినవి 93, డీ-పట్టాకు చెందినవి 28, ల్యాండ్ పూలింగ్‌కు చెందినవి 11, 22-ఏకు సంబంధించి 8, కోర్టు వివాదాల్లో ఉన్నవి, క్లాసిఫికేషన్‌కు చెందినవి ఒక్కో దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

# రేషన్ పంపిణీలో ఇష్టారాజ్యం!

... 5వ పేజీ తరువాయి

డిపో నంబరు 0386153లో పరిమితికి మించి ఉన్న 129 బస్తాల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ డిపోలో మొత్తం 437 కార్డులు ఉండగా శుక్రవారం సాయంత్రం వరకు 303 కార్డులకు బియ్యం పంపిణీ చేసినట్టు ఆన్‌లైన్‌లో నిర్ధారణ అయింది. విచిత్రమేమిటంటే... బియ్యం తీసుకున్న 303మందిలో డిపో పక్కనే నివసిస్తున్న వారి సంఖ్య కేవలం 11 కాగా ఇతర ప్రాంతాల వారు 292 మంది ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిన తరువాత ప్రతి వలంటీరుకు తన పరిధిలో నివసిస్తున్న 50 మంది కార్డుదారులను అందుబాటులో ఉన్న డిపోలకు మ్యాపింగ్ చేశారు. ఈ మేరకు తొలుత మ్యాపింగ్ చేసిన కార్డుదారులకు సరకులు ఇచ్చి, తరువాత పోర్టబిలిటీ ద్వారా ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాలి. ఇందుకోసం డిపో పరిధిలోని కార్డుదారుల సంఖ్యకు అదనంగా సెకండ్ అలాట్‌మెంట్ ద్వారా సరకులు సరఫరా చేస్తుంటారు. అయితే ఇతర జిల్లాల నుంచి వలసవచ్చిన వారికి బియ్యం పంపిణీలో ఎండీయూలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక్కో డిపో పరిధిలో ఉన్న కార్డుల సంఖ్యకు అదనంగా 20 నుంచి 30 శాతం పోర్టబిలిటీ కార్డులుంటాయి. అయితే పూర్ణామార్కెట్ ఏరియాలో కొందరు డీలర్లు/ఎండీయూలు బియ్యానికి బదులు డబ్బు తీసుకునే వారిని గుర్తించి అక్కడకు వాహనం తరలించి, వేలిముద్రలు తీసుకుంటున్నారు. డిపో సమీపంలోని వారు అడిగితే స్టాకు అయిపోయిందని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో డీలర్లు/ఎండీయూలకు పౌరసరఫరాల శాఖ పరిధిలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు వత్తాసు పలుకుతున్నారు. కార్డుదారుల నుంచి అక్రమంగా కొనుగోలుచేసిన బియ్యాన్ని ఎండీయూ వాహనాల్లోనే అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా అయితే ఎవరికీ అనుమానం రాదనే ఉద్దేశంతో కొందరు బరి తెగిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

# స్క్రాప్ దుకాణాలపై జీవీఎంసీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

అంటుకుని క్షణాల్లో విస్తరించడంతోపాటు పెద్దఎత్తున మంటలు ఎగసిపడి పక్కన ఉండే దుకాణాలు, ఇళ్లకు ప్రమాదం ఉంటుంది.

**నివాసాల మధ్యనే...**

నగరంలో వన్‌టౌన్, గాజువాక, మల్కాపురం పరిసరాల్లో జనవాసాలు, పరిశ్రమలకు సమీపంలోనే అత్యధికంగా స్క్రాప్ దుకాణాలున్నాయి. మరికొన్ని ఏకంగా షాపింగ్‌కాంప్లెక్స్‌ల్లో నిర్వహిస్తున్నారు. వాటి గోడౌన్‌లుకూడా దుకాణాలను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలు, రోడ్ల పక్కన ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎప్పటికైనా ప్రమాదం తప్పదని గుర్తించిన జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ స్క్రాప్ దుకాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా కార్యాచరణ రూపొందించాలని జీవీఎంసీ అగ్నిమాపకశాఖ అధికారిని ఆదేశించారు. దీంతో వారు దుకాణాలకు భద్రతాలోపాలపై నోటీసులు జారీచేస్తున్నారు. ఇప్పటివరకూ ఐదు దుకాణాలకు జారీచేశామని, త్వరలోనే మిగిలినవాటికి అందజేసి కమిషనర్ సమక్షంలో సమావేశం ఏర్పాటుచేస్తామని జీవీఎంసీ అగ్నిమాపకశాఖ అధికారి వై.హనుమంతరావు తెలిపారు. స్క్రాప్ దుకాణాలకు అనుమతులు జారీచేయడం, పర్యవేక్షించడంలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఎవరికివారు ఇష్టారాజ్యంగా దుకాణాలను ఏర్పాటుచేస్తున్నారన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# స్టాఫ్ నర్సు పోస్టులకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

దళారులు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. తొలుత కొంత మొత్తం చెల్లిస్తే చాలని, పోస్టు వచ్చిన తరువాత మిగిలిన మొత్తం ఇవ్వాలని అభ్యర్థులను ఆశపెడుతున్నారు. ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీ సూచించారు. ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని వస్తే వారి వివరాలను తెలియజేయాలని ఆమె కోరారు. మెరిట్ ప్రాతిపదికనే ఎంపిక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో అపోహలు, అనుమానాలను తావులేదన్నారు. మెరిట్ జాబితాను విడుదల చేసిన తరువాత అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని నివృత్తి చేసిన తరువాత తుది జాబితాను వెల్లడిస్తామన్నారు.

# కుదేలైన ప్రాథమిక పాఠశాలలు

... 5వ పేజీ తరువాయి

ఆయా పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యాబోధన సజావుగా సాగదని, భవిష్యత్తులో పాఠశాల ఎత్తివేస్తారన్న అనుమానంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. 3,4,5 తరగతుల పిల్లలను ఉన్నత పాఠశాలలకు పంపడంపైనా విముఖత చూపారు. దీంతో తరువాతి ఏడాదికి ప్రాథమిక పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గింది. ఈ ఏడాది మరింతగా తగ్గడంతో 54 పాఠశాలల్లో పది మంది కంటే తక్కువగా విద్యార్థులున్నారు.

**జీవోను రద్దుచేసిన ప్రభుత్వం**

ఇదిలావుండగా కూటమి ప్రభుత్వం జీవో 117 రద్దుచేసింది. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు మారుస్తామని ప్రకటించింది. ప్రతి పంచాయతీలో 60మంది పిల్లలున్న పాఠశాలను మోడల్‌గా మార్చుతామని, తక్కువ ఉంటే బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగిస్తామని తెలిపింది. తక్కువ పిల్లలున్న పాఠశాలల్లో 1,2 తరగతులకు మాత్రమే కొనసాగించి 3,4,5 తరగతులకు మోడల్ ప్రాథమిక పాఠశాలలకు మార్చినా ప్రైమరీ పాఠశాలల మనుగడకు ముప్పు తప్పదని ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు.

# రైళ్లకు తగ్గని రద్దీ

... 5వ పేజీ తరువాయి

కిక్కిరిశాయి. విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్‌తో పాటు తిరుమల, ప్రశాంతి, మెయిల్, స్వర్ణజయంతి, విశాఖ, గోదావరి, కోణార్క్, ఫలక్‌నుమా, ఎల్‌టీటీ రైళ్లను ఆశ్రయించారు. హౌరా వైపు వెళ్లే రైళ్లకు రద్దీ నెలకున్నది. ఆఫ్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ పొంది నిరీక్షణ జాబితాకు పరిమితమైనవారితోపాటు జనరల్ టికెట్ ప్రయాణికులు రిజర్వేషన్ కోచ్‌లను ఆశ్రయించడంతో ఫుట్‌బోర్డు, బాత్‌రూమ్‌ల వద్ద నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది.

**ఆర్టీసీకీ ప్రయాణికుల తాకిడి**

ద్వారకాబస్‌స్టేషన్: సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో ఆర్టీసీ రద్దీగా మారింది. అంతర్‌జిల్లా సర్వీసులతో పాటు, సిటీ బస్సులు ఆదివారం కిటకిటలాడాయి. విశాఖ రీజియన్ నుంచి 150 ప్రత్యేక బస్సులు నడిపారు. హైదరాబాద్‌కు 14, విజయవాడకు 35, భీమవరానికి 2, కాకినాడకు 10, రాజమండ్రికి 30 బస్సులు నడిచాయి. విజయనగరానికి 12, సాలూరు 4, పార్వతీపురం 5, రాజాం 2, శ్రీకాకుళం 20, ఇచ్ఛాపురం 5, పలాస 5, టెక్కలి 2, సోంపేట 3, పర్లాకిమిడి ఒకటి ప్రత్యేక సర్వీసులు వెళ్లాయి. డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు పర్యవేక్షించారు. సోమవారం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

## ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలి

సింహాచల దేవస్థానం ఈవో త్రినాథరావు


క్లాత్ బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న ఈవో త్రినాథరావు, తదితరులు

సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితాలతో పెనువేసుకుపోయిన ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు అని శాస్త్రవేత్తలు చెబుతున్నందున అందరూ అందుకు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సింహాచల దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు కోరారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పిలుపు మేరకు కోరమాండల్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో జేడీ ఫౌండేషన్, గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింహగిరిపై అప్పన్నస్వామి భక్తులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో క్లాత్ బ్యాగ్‌లను ఆదివారం ఉదయం ఆవిష్కరించారు. అనంతరం క్లాత్ బ్యాగ్‌లను భక్తులకు పంపిణీ చేశారు.

## వీధి లైట్లు వెలగక అంధకారంలో సాగర్‌నగర్

సాగర్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధి సాగర్‌నగర్‌లో వీధి లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. ఎంఐజీ డి-బ్లాక్‌లో గత కొద్ది రోజులుగా వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రయ్యేసరికి చీకటి రాజ్యమేలుతోంది. దీంతో చీకటి పడితే ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చీకట్లో నడిచేటప్పుడు ఎక్కడ విషపురుగుల బారిన పడతామోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సుమారు నెల రోజులుగా వీధి లైట్లు వెలగకపోయినా పట్టించుకునే నాథులే కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఐజీ-సీ బ్లాక్, ఎంఐజీ-డీబ్లాక్‌ల మధ్యనున్న రహదారిపై ఈ పరిస్థితి నెలకొంది. పండుగ సమయాల్లోనూ ఇక్కడ చీకటి తాండవించిందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా పటిష్ట చర్యలు చేపట్టవలసిందిగా కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మైక్రోసాఫ్ట్ ఉత్తమ శిక్షకుడిగా రాజేశ్

» ఘనత సాధించిన విశాఖ ఐటీ నిపుణుడు



విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ సెక్యూరిటీ శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో ప్రపంచ వ్యాప్తంగా మంచి ప్రతిభ చూపిన 100 మందిని మైక్రోసాఫ్ట్ సంస్థ గుర్తించింది. ఇందులో విశాఖకు చెందిన ఐటీ నిపుణుడు డాక్టర్ కేవీఎన్. రాజేశ్ చోటు దక్కించుకున్నారు. ఈ మేరకు తాజాగా మైక్రోసాఫ్ట్ కంపెనీ షీల్డ్, సర్టిఫికెట్ బహూకరించింది. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ నుంచి డాక్టరేట్ తీసుకున్న రాజేశ్ ప్రస్తుతం బెంగళూరులోని క్లౌడ్ దట్ సంస్థలో సీనియర్ సబ్జెక్టు నిపుణుడిగా పని చేస్తున్నారు. ఐటీ రంగంలో సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్‌మేనేజ్‌మెంట్/ సెక్యూరిటీపై ఉద్యోగులు, విద్యార్థులకు అవగాహన ఉండాలని డాక్టర్ రాజేశ్ అన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

» రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో స్థానికుల భయాందోళనలు
» పట్టించుకోని జీవీఎంసీ, విద్యుత్ శాఖల అధికారులు,

ఆరిలోవ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా తయారయ్యాయి. వీటిని ఎప్పుడో ఏర్పాటు చేసినప్పటికీ, సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందిగా మారింది.ఈ విషయమై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సరైన ప్రణాళిక లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో కొత్తగా వచ్చిన నిర్మాణాలు, భౌగోళికంగా మారుతున్న పరిసరాల కారణంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. పలు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడం, బాగా తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆటో స్టాండ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలు అటుగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సాంకేతిక కారణాల వల్ల కొన్నిసార్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి శబ్దాలు రావడం, నిప్పులు ఎగజిమ్మడం జరుగుతూ ఉంటుంది. అలాంటప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు భయపడుతున్నారు.



ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేని ట్రాన్స్‌ఫార్మర్

### అధికారుల నిర్లక్ష్యం

ఏనాడో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా జనాభా ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు ఎదురవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయడం, ఎత్తయిన దిమ్మెలపైకి వాటిని మార్చడం, పాత వాటికి మరమ్మతులు చేయడం వంటివి నిర్వహించాలి. కానీ అవేవీ పట్టనట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరగక ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



కనీస జాగ్రత్తలు లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



జలకన్యల ప్రదర్శనను తిలకిస్తున్న వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, ప్రదర్శన నిర్వాహకులు రాజారెడ్డి తదితరులు

## పర్యాటక కేంద్రంగా నగరాభివృద్ధి

వెంకోజీపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తామని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుక భాగంలోని ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఆదివారం ఆయన సందర్శించారు. నగరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన మిరమైడ్స్ (జలకన్యల) ప్రదర్శనను నగరవాసులతో కలిసి వీక్షించారు. విశాఖ ప్రజలను పర్యాటకులను అమితంగా ఆకర్షించే విధంగా ఈ ఎక్స్‌పో నిలుస్తోందన్నారు. ఇటువంటి ప్రత్యేక ఆకర్షణలు విశాఖ నగరానికి మరింత గుర్తింపు తీసుకువస్తాయని పేర్కొన్నారు. పర్యాటకంగా మరింత ముందుకు తీసుకువెళ్లే దిశగా ఎక్స్‌పో 2025లో ఏర్పాటు చేసిన వైవిధ్య అంశాలు, కశ్మీర్ సిటీ నమూనా, అమ్యూజ్‌మెంట్ పార్కులను ఆయన తిలకించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ లావణ్యకు సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ లావణ్య

వెంకోజీపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మక సావిత్రిబాయి పూలే జాతీయ పురస్కారాన్ని ఏయూ తెలుగు విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెంద్యాల లావణ్య అందుకున్నారు. స్త్రీ విద్య, సమానత్వం, సాధికారత కోసం పాటు పడుతున్న ప్రతిభావంతులు నిష్ణాతులైన వారికి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఆదివారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీఎల్టీవో వారు అవార్డును అందజేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజేష్, మలినేని విద్యా సంస్థల డైరెక్టర్ మలినేని పెరుమాళ్ల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అంగలకుదురు గాయత్రీదేవిల చేతుల మీదుగా లావణ్య ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తన పేరు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేయడం సంతోషంగా ఉందని లావణ్య అన్నారు. సావిత్రి బాయి పూలే జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న డాక్టర్ పెంద్యాల లావణ్యను ఏయూ ఉన్నతాధికారులు, తెలుగుశాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, తెలుగు విభాగాచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహితి, భాషాభిమానులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

» ఎమ్మెల్సీ చిరంజీవిరావు



ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ఎంవీపీ కాలనీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలలను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయ సంఘాలు సహకారం అందించాలని కోరారు. ఎంవీపీ కాలనీలోని వుడా బిల్డింగ్‌లో ఆదివారం జరిగిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిరంజీవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు తగిన కృషి చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయుల నుంచి సంపూర్ణ సహకారం అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనలను క్రోడీకరించి, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శికి నివేదిక అందజేస్తానని ఆయన ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫార్మసీ పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన 2000-2004 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ బి-ఫార్మసీ (2000-2004 బ్యాచ్) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ బ్యాచ్‌కు చెందిన అనేకమంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఒకే దగ్గర చదివి 25 ఏళ్ల పూర్తికావడంతో అందరూ కలుసుకోవాలని నిర్ణయించుకుని వర్సిటీలోని కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ కళాశాల స్మృతులను, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబసభ్యుల గురించి కలబోసుకున్నారు. తరగతి గదిలో కూర్చుని అప్పుడు చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. గతంలో తాము కూర్చున్న సీట్లలో ఉపాధ్యాయులు, సహచరులతో కలిసి కూర్చుని సందడి చేశారు. ఇందులో నాటి అధ్యాపకులు కూడా పాల్గొన్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి మధుర జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుగు ప్రయాణంతో రద్దీ



రహదారిపై వాహనాల రద్దీ

ఆరిలోవ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతికి సొంతూరు వెళ్లిన వారంతా ఆదివారం తిరుగు పయనమై సాయంత్రానికి నగరానికి చేరుకున్నారు. దీంతో హనుమంతవాక జంక్షన్‌లో రద్దీ నెలకొంది. బస్సులు రద్దీగా వచ్చాయి. సోమవారం నుంచి విద్యాసంస్థలు తెరవనుండడంతో అంతా చేరుకున్నారు.

## అలరించిన చిన్నారుల సంగీత కచేరి




వేణుగానం వినిపిస్తున్న చిన్నారులు

మద్దిలపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : త్యాగరాజ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా పిఠాపురంకాలనీ కళాభారతిలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన చిన్నారుల వేణుగాన కచేరి అలరించింది. పదేళ్ల లోపు చిన్నారులు త్యాగరాజస్వామి కృతులు అద్భుతంగా వేణువుపై ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశారు. మధ్యాహ్నం డాక్టర్ ద్వారం త్యాగరాజు త్యాగరాజ స్వామి, అమ్మవారి పాటలు ఆలపించారు. కచేరిలో వేణువుపై కాశీ ప్రసాద్, లలితచంద్రశేఖర్ గాత్రం, లక్ష్మీ గణపతి వయోలిన్‌పై వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ నిర్వహకులు గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ చిన్నారులకు సంగీతంలోప్రోత్సహించాలని కచేరి ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సుసర్ల రామగోపాల్ పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్యాకేజీపై సందేహాలు

**మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొత్స, పక్కన మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్సీ ధర్మశ్రీ

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీపై తమకు అనుమానాలు ఉన్నాయని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు.

బీచ్‌రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంటు ముసుగులో కూటమి పార్టీలు గుద్దులాడుకుంటున్నాయన్నారు. ప్రైవేటీకరణ వ్యూహం లో భాగంగానే కేంద్రం ప్యాకేజీ ప్రకటి ంచిందన్నారు. అప్పులు తీర్చడానికి మాత్రమే ప్యాకేజీ ఇస్తే, పరిశ్రమ నిర్వహణ మాట ఏమిటని బొత్స ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్యాచరణ ప్రకటించకపోవడంతో ఏదో మతలబు ఉందని బొత్స అనుమానం వ్యక్తంచేశారు. కార్మిక సంఘాలతో కలిసిస్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పోరాటం సాగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆర్భాటం, ప్రచారయావ తప్ప ప్రజారక్షణపై బాధ్యత లేదన్నారు. తిరుపతి ఘటనను సుమోటోగా తీసుకుని న్యాయవిచారణ జరపాలని కోరుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశానని బొత్స తెలిపారు. రుషికొండ భవనాలు ముమ్మాటికీ రాష్ట్రప్రభుత్వ ఆస్తి అని, వాటిలో అవకతవకలు ఉంటే విచారణ జరుపుకోవచ్చునన్నారు. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ కోసం ఈ నెల 29 వరకు ఎదురుచూసి ఆందోళన చేస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

## సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా గో బ్యాక్

» ప్రజా, వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు




జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా, వామపక్ష కార్మిక సంఘాల నేతలు

సిరిపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : 'అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా గో బ్యాక్' అంటూ ప్రజా, వామపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన నేపథ్యంలో నిరసన చేపట్టి 'గో బ్యాంక్ అమిత్ షా' అంటూ నినాదాలు చేశారు. తక్షణమే అమిత్ షా రాజీనామా చేయాలని, అమిత్‌షాను పార్లమెంటు నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్రమంత్రి అమిత్ షాకు రాజ్యాంగం గౌరవం ఉంటే అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయరన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఓట్లు కోసం, అధికారం కోసం మాత్రమే అంబేడ్కర్ విగ్రహాలను పార్లమెంట్‌లో పెడుతున్నారన్నారు. రాజకీయ నాయకులు రాజ్యాంగాన్ని అవమానించడానికి వెనుకాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి దళితులకు ఉన్న రిజర్వేషన్లు రద్దు చేయడానికి మోదీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.

ఈ నిరసనలో సీపీఎం కార్యవర్గ సభ్యులు కె. లోకనాథం, ఎం.జగన్నాయుడు, కేఎం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నాయనబాబు, బొట్ట ఈశ్వరమ్మ, ఎం.వెంకటేశ్వర్లు, సీపీఐ కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జీఎస్‌జె అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు

ఎంవీపీ కాలనీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఐఐఎం సెమినార్ హాలులో నిర్వహించారు.

అధ్యక్షుడిగా పి.కిశోర్, ఉపాధ్యక్షులుగా ప్రభకిషోర్, కార్యదర్శిగా మోహన్‌రావు, కోశాధికారిగా సత్యారావు, బోర్డు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఇన్‌స్టాలేషన్ అధికారిగా డిస్ట్రిక్ 101 గవర్నర్ కె.ద్వారాకానాథ్ వ్యవహరించారు. క్యాబినెట్ సెక్రటరీ, ఎలెక్ట్ గవర్నర్ మహేష్, ఆర్సీఫైవ్ ఉప్పలపాటి శుభ, ముఖ్య సలహాదారుగా ఎన్.త్రినాథరావు పాల్గొన్నారు.

వాకర్స్ వ్యవస్థాపకులు సుంకరి అళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు, డెప్యూటీ గవర్నర్ కృష్ణంరాజు సభ్యులను అభినందించారు.

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు(తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 18, క్యారెట్ 54 దొండకాయలు 42, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 32, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

| కోడిగుడ్లు (నెక్) | (వంద - రూ.లలో) |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 125 |
| లైవ్ ధర | 145 |
| విత్ స్కిన్ | 260 |
| స్కిన్‌లెస్ | 270 |

## అమర్‌నాథ్‌కు పలువురు నేతల అభినందనలు



గుడివాడ అమర్‌నాథ్‌కు అభినందనలు తెలుపుతున్న వైసీపీ నాయకులు

మద్దిలపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నాయకత్వం పార్టీకి ప్రయోజకరమని వైసీపీ తూర్పు నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావు అన్నారు. చోడవరం సమన్వయకర్తగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌కు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ చోడవరానికి సమన్వయకర్తగా గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించడం శుభపరిణామన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ బలోపేతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవిరెడ్డి, రామన్నపాత్రుడు, పీతల గోవింద్, రవి, ముప్పల సురేష్, స్వాతిదాసు, బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ చాంప్ విశాఖ

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి-స్పోర్ట్సు):ఏసీఏఅంతర్ జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ టోర్నీలో ఆతిథ్య విశాఖ చాంపియన్‌గా నిలిచింది.ఆదివారం వీడీసీఏ-బి గ్రౌండ్ లో జరిగిన ఫైనల్స్‌లో విశాఖ 68 పరుగుల తేడాతో నెల్లూరుపై ఘనవిజయం సాధించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ నిర్ణీత 35 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. పి.యశిల్ విఘ్నేష్ (49), ఆర్.మోక్షిత్ నాయుడు (31), యు.జాషువ (25) రాణించారు.నెల్లూరు బౌలర్ తన్విక్‌రెడ్డి 2 వికెట్లు పడగొట్టాడు.లక్ష్య ఛేదనలో నెల్లూరు నిర్ణీత 35 ఓవర్లలో 9 వికెట్లకు 118 పరుగులు చేయడంతో ఓటమి చెందింది.

## 'ప్లాస్టిక్ రహిత విశాఖ'గా మారుద్దాం

**జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్**




వాకథాన్‌లో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ డా.సంపత్‌కుమార్, అదనపు కమిషనర్లు సోమన్నారాయణ, ఎస్ఎస్ వర్మ, రమణమూర్తి, సినీనటి పావని తదితరులు

మహారాణిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై నగరవాసులను చైతన్యవంతులను చేస్తూ ముందడుగు వేసిన సామాజిక ఉద్యమ ప్రభావ శీలురు (సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్) అందిస్తున్న సహకారం అభినందనీయం..స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డా.పి.సంపత్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, మిలీనియం సాఫ్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆదివారం బీచ్‌రోడ్డులో 'ప్లాస్టిక్ రహిత విశాఖ' కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా విశాఖ నగరానికి చెందిన సినీనటి కుమారి పావని (పుష్ప-2) మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం అభినందనీయమన్నారు. సకల మానవాళికి, మూగజీవుల ప్రాణాలకు హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కృషిచేస్తున్న జీవీఎంసీకి అందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. భావితరాలకు మంచిబాట వేస్తూ, పర్యావరణాన్ని కాపాడే దిశగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత విశాఖ (ఫ్రీ ప్లాస్టిక్ వైజాగ్) పేరుతో రూపొందించిన సుమారు 100 అడుగుల గుడ్డ బ్యానర్‌తో బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం రాజమండ్రికి చెందిన క్రంచ్ బిస్కెట్ కప్స్ ఉత్పత్తిదారులు ప్లాస్టిక్ కప్పుల వినియోగానికి ప్రత్యామ్నాయంగా 'టీ తాగండి.. కప్పు తినండి' నినాదంతో రాగి పిండితో తయారు చేసిన క్రంచ్ కప్పులలో టీ ని సరఫరా చేసి అందరికీ అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్ఎస్ వర్మ, డి.వి. రమణమూర్తి, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, సుమారు 600 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్యాకేజీ ఓ వంచన'



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వివి రమణమూర్తి

సీతంపేట, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ ఓ వంచన అని, దీన్ని తమ విజయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నేతలు చెప్పుకోవడం శోచనీయమని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థల ప్రతినిధులు ఆక్షేపించారు. విశాఖ ఉక్కును ప్రాణాలొడ్డయినా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ప్యాకేజీ ఇస్తున్నట్లు ప్రకటించి, ఖర్చుపై ఆమోద యోగ్యం కాని షరతులు విధించడం అన్యాయమన్నారు. ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటి నుంచి ఒకరు ప్లాంట్ రక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దీనికి గనులు కేటాయించకపోవడం క్షమార్హం కాదన్నారు. 1430 రోజులుగా ఉద్యమిస్తున్న కార్మికుల విషయమై కనీసం మాట్లాడలేదన్నారు. సమావేశంలో ఉక్కు పోరాట కమిటీ సభ్యులు కనకారెడ్డి, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేంకటేశ్వరరావు, మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం నాయకులు రవి, భీమ్‌సేన్ వార్ నాయకుడు కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## 127 మందికి వైద్య పరీక్షలు



వాకర్స్ క్లబ్‌లో పరీక్షిస్తున్న వైద్యులు

మురళీనగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. క్లబ్ కొత్త అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ పర్యవేక్షణలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యులు సేవలందించారు. ఓమ్ని హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ వైద్యులు బి.మోహన్ కల్యాణ్ శిబిరానికి వచ్చిన 127 మందిని పరీక్షించారు. అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి, ఇతర రుగ్మతలకు సేవలు లభించినట్లు క్లబ్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

## మానసిక దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు

డాబాగార్డెన్స్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ది ఎబిలిటీ పీపుల్ పునరావాస కేంద్రంలో జీవీఎంసీ సౌజన్యంతో గెయిల్ వారి ఆర్థిక సహాయంతో ఈ నెల 20 నుంచి 31 వరకు శారీరక, మానసిక దివ్యాంగులకు బుద్ధి మాంద్యం గల పిల్లలకు అవసరమైన పరికరాలు ఇవ్వనున్నట్లు ది ఎబిలిటీ పీపుల్ వ్యవస్థాపక డైరెక్టర్ దిలీప్ పాత్రో తెలిపారు. నేషనల్ ట్రస్ట్ ద్వారా నిర్మయ హెల్త్ ఇన్సూరెన్స్, లీగల్ గార్డెన్, సర్వీసులు కూడా ఉచితంగా చేస్తామన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 8500365736ను సంప్రదించాలని కోరారు.

## యోగి వేమన జయంతి వేడుకలు

సీతమ్మధార, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నక్కవానిపాలెంలోని ఇందిరా గాంధీ పార్కులో గల వేమన విగ్రహానికి కార్పొరేటర్, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురికి పండ్లు పంపిణీ చేశారు.

## టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ

విశాఖపట్నం స్పోర్ట్సు జనవరి 19, (ఆంధ్రజ్యోతి): డెహ్రాడూన్‌లో జరిగే ప్రతిష్టాత్మక జాతీయ సీనియర్ టేబుల్ టెన్నిస్ టోర్నీకి నగరానికి చెందిన జీవిత బీమా సంస్థ క్రీడా ప్రోత్సాహక కమిటీ సభ్యుడు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మ అంపైర్‌గా నియమితులయ్యారు. భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్ఐసీ సీనియర్ అధికారులు హర్షం ప్రకటించారు.

## తవ్వి వదిలేశారు!



గుంతలమయంగా జ్ఞానాపురం రహదారి

జ్ఞానాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 41వవార్డు జ్ఞానాపురం రహదారి గుంతలమయంగా మారింది. జ్ఞానాపురం ఫ్లైఓవర్ నుంచి కాన్వెంటు కూడలి వరకు ఇటీవల అమృత్ మంచినీటి పథకం కింద పైపులైన్లు వేసేందుకు రహదారిని పూర్తిగా తవ్వారు. కాని వాటిని పూర్తి స్థాయిలో పూడ్చకుండా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల పార్కింగ్, రోడ్డుపై మరమ్మతుల కారణంగా ఇరుగ్గా ఉండే ఈ రోడ్డు ఇప్పుడు తవ్వకాలతో మరింత చిన్నదిగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అయినా జీవీఎంసీ అధికారులు స్పందించడంలేదని వాహనదారులు వాపోతున్నారు. రద్దీగా ఉండే ఇలాంటి ప్రాంతాల్లో త్వరితగతిన పనులు పూర్తి చేయించేలా అధికారులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు. వెంటనే గుంతలను పూడ్చి రోడ్డు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

# నేటి నుంచి పోలమాంబ అమ్మవారి పరస

» విద్యుత్ దీపకాంతులతో ఆలయ పరిసరాలు » తొలేళ్ల సంబరానికి విస్తృత ఏర్పాట్లు » 22న జాతరకు ప్రత్యేక పోలీసు బందోబస్తు



విద్యుత్ కాంతులతో కుమ్మరవీధి



పోలమాంబ అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుమ్మరవీధిలో వెలసిన పోలమాబ అమ్మవారి 67వ పరస (మహోత్సవం)కు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం తొలేళ్ల సంబరం జరుగుతుంది. ఉదయం మూలవిరాట్ వద్ద పోలమాంబ అమ్మవారిని పసుపుతో అద్ది ప్రత్యేక పూజలు చేస్తారు. పసుపు అద్ది ఉన్న పోలమ్మ తల్లిని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. సాయంత్రం అమ్మవారికి ముత్తయిదువులు, భక్తులు జలాభిషేకం చేస్తారు. పరస సందర్భంగా పురవీధులన్నీ విద్యుత్ దీపకాంతులతో వెలిగిపోతున్నాయి. లేపాక్షి మెయిన్ రోడ్డు నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో లేపాక్షి జంక్షన్‌లో మరోసారి పండుగ వాతావరణం నెలకొంది. తొలేళ్ల సందర్భంగా పేద మహిళలు, విద్యార్థులకు చీరలు, పుస్తకాలు పంపిణీ చేస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పరస ఘనంగా ప్రారంభమవుతుంది. 22న జాతరను పురస్కరించుకొని అమ్మవారి గర్భగుడి, ఆలయ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజాము నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. పురవీధుల్లో వివిధ కళారూపాల ప్రదర్శన, నిప్పుల గుండం ఏర్పాటు చేస్తారు. రాత్రి 11 గంటల వరకు పలు ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివస్తారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఆడపడుచులు, అల్లుళ్లు చేరుకోవడంతో ఆలయ పరిసరాల్లోని గృహాలన్నీ సందడిగా మారాయి. సాయంత్రం వాచ్‌హౌస్ వద్ద ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి ఆహ్వానితులను సన్మానించేందుకు పోలమాంబ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు సన్నద్ధమవుతున్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, టీడీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్, కార్పొరేటర్ కొండమ్మ, పురప్రముఖులు, భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. 22న మహా అన్నసంతర్పణ జరుగుతుంది.

# 'ప్లాస్టిక్ రహిత విశాఖ'గా మారుద్దాం




ఆర్కే బీచ్‌లో ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్‌పై వాకథాన్‌లో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ డా.సంపత్‌కుమార్, సినీనటి పావని తదితరులు

మహారాణిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై నగరవాసులను చైతన్యవంతులను చేస్తూ ముందడుగు వేసిన సామాజిక ఉద్యమ ప్రభావ శీలురు (సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్) అందిస్తున్న సహకారం అభినందనీయం..స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ డా.పి.సంపత్ కుమార్ అన్నారు. జీవీఎంసీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆదివారం బీచ్‌రోడ్డులో 'ప్లాస్టిక్ రహిత విశాఖ' కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా విశాఖ నగరానికి చెందిన సినీనటి కుమారి పావని (పుష్ప-2) మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్ నిషేధం అభినందనీయమన్నారు. సకల మానవాళికి, మూగజీవుల ప్రాణాలకు హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కృషిచేస్తున్న జీవీఎంసీకి అందరూ సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. భావితరాలకు మంచిబాట వేస్తూ, పర్యావరణాన్ని కాపాడే దిశగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత విశాఖ (ఫ్రీ ప్లాస్టిక్ వైజాగ్) పేరుతో రూపొందించిన సుమారు 100 అడుగుల గుడ్డ బ్యానర్‌తో బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం రాజమండ్రికి చెందిన క్రంచ్ బిస్కెట్ కప్స్ ఉత్పత్తిదారులు ప్లాస్టిక్‌కప్పుల వినియోగానికి ప్రత్యామ్నాయంగా 'టీ తాగండి.. కప్పు తినండి' నినాదంతో రాగి పిండితో తయారు చేసిన క్రంచ్ కప్పులలో టీ సరఫరా చేసి అందరికీ అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్ఎస్ వర్మ, డి.వి. రమణమూర్తి, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, సుమారు 600 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ చాంప్.. విశాఖ



కప్పుతో విన్నర్స్ విశాఖ జట్టు సభ్యులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అంతర్ జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ టోర్నీలో ఆతిథ్య విశాఖ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్స్‌లో విశాఖ 68 పరుగుల తేడాతో నెల్లూరుపై ఘనవిజయం సాధించి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ నిర్ణీత 35 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. పి.యశిల్ విఘ్నేష్ (49), ఆర్.మోక్షిత్ నాయుడు (31), యు.జాషువ (25) రాణించారు. నెల్లూరు బౌలర్ తన్వీర్‌రెడ్డి రెండు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో నెల్లూరు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 118 పరుగులు చేయడంతో ఓటమి చెందింది. సమీర్ షేక్ (30), ఎస్.జోషువ్ (19) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. విశాఖ బౌలర్లలో బి.రోహిత్ మూడు వికెట్లు పడగొట్టగా, పి.పవన్ కార్తికేయ, ఎన్.షణ్ముఖ్ గణేష్ చెరో రెండు వికెట్లు తీశారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏసీఏ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటరామ ప్రశాంత్, గేమ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎం.ఎస్.కుమార్, ఏజీఎం డి.శివకుమార్, ఏసీఏ వీడీసీఏ స్టేడియం ఇన్‌చార్జి జె.కె.ఎం.రాజు పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు.

## హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడిగా విజయ్‌కుమార్



నూతన అధ్యక్షుడు, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న కంచరాన సూర్యనారాయణ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎలమంచిలి శాసనసభ్యుడు సుందరపు విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో జరిగిన రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలలో కార్యదర్శిగా పి.సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వరరావు, కె.చిన్నప్పరెడ్డి, కోశాధికారిగా కె.రుద్రరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వి.మల్లేశ్వరరావు, కె.సుజాత ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా కె.రవిశేఖర్, ఎం.రాంకుమార్, డి.జితేంద్ర, ఎస్.శివశంకర్, కె.శ్రీనివాసరావు, పి.దిల్లేశ్వర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది రవి వ్యవహరించగా, పర్యవేక్షకులుగా భారత హ్యాండ్‌బాల్ సమాఖ్య ప్రతినిధి విష్ణు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్, ద ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి మోహన్ వెంకటరామ్ వ్యవహరించారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సుందరపు విజయ్‌కుమార్‌ను ద ఒలింపిక్ సంఘం విశాఖ ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ ఘనంగా సత్కరించి అభినందించారు.

# స్టీల్‌ప్లాంట్ ప్యాకేజీపై అనుమానాలు ఉన్నాయి

శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీపై తమకు అనుమానాలు ఉన్నాయని శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ముసుగులో కూటమి పార్టీలు వాదులాడుకుంటున్నాయన్నారు. ప్రైవేటీకరణ వ్యూహంలో భాగంగానే కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. అప్పులు తీర్చడానికి మాత్రమే ప్యాకేజీ ఇస్తే, పరిశ్రమ నిర్వహణ మాట ఏమిటని బొత్స ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్యాచరణ ప్రకటించకపోవడంతో ఏదో మతలబు ఉందని బొత్స అనుమానం వ్యక్తంచేశారు. కార్మిక సంఘాలతో కలిసి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం కొన సాగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆర్భాటం, ప్రచార యావ తప్ప ప్రజారక్షణపై బాధ్యత లేదన్నారు. తిరుపతి ఘటనను సుమోటోగా తీసుకుని న్యాయవిచారణ జరపాలని కోరుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశానని బొత్స తెలిపారు. రుషికొండ భవనాలు ముమ్మాటికీ రాష్ట్రప్రభుత్వ ఆస్తి అని, వాటిలో అవకతవకలు ఉంటే విచారణ జరుపుకోవచ్చునన్నారు. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ కోసం 29 వరకు ఎదురుచూసి ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



పార్కును శుభ్రపరుస్తున్న కార్పొరేటర్ వీరారావు బుజ్జి

అక్కయ్యపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి అన్నారు. డైమండ్ పార్కులో పారిశుధ్య పర్యవేక్షకుడు అయిత కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ వీరారావు స్థానికులతో కలిసి పార్కులోని పనికిరాని మొక్కలను, చెత్త, వ్యర్థాలను తొలగించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాలను రోజూ ఎవరికివారు శుభ్రం చేసుకుంటే ఎలాంటి వ్యాధులు సంభవించవన్నారు. అంతేకాకుండా పరిసరాలు కూడా శుభ్రంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మీ శివప్రసాద్, నాయకులు మజ్జి వెంకట సత్యనారాయణ, పారిశుధ్య కార్యదర్శులు మాధురి, సత్యవతి, లక్ష్మణరావు, సూపర్‌వైజర్లు విజయ్‌కుమార్, ప్రకాష్, గోపి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



కళాశాల ఆవరణలో ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ బి-ఫార్మసీ (2000-2004 బ్యాచ్) విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ బ్యాచ్‌కు చెందిన అనేకమంది దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఒకే దగ్గర చదివి 25 ఏళ్లు పూర్తికావడంతో అందరూ కలుసుకోవాలని నిర్ణయించుకుని వర్సిటీలోని కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ కళాశాల స్మృతులను, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబ సభ్యుల గురించి కలబోసుకున్నారు. తరగతి గదిలో కూర్చుని అప్పుడు చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. గతంలో తాము కూర్చున్న సీట్లలో ఉపాధ్యాయులు, సహచరులతో కలిసి కూర్చుని సందడి చేశారు. ఇందులో నాటి అధ్యాపకులు కూడా పాల్గొన్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సీతంపేట, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని క్రైమ్ ఏసీపీ వెంకటరావు హితవు పలికారు. గ్రంథాలయాలకు వెళ్లి అనేక విషయాలు చదివిన వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విశాఖపట్నం సిటీ క్రైం బ్రాంచ్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఏసీపీ వెంకటరావు మాట్లాడుతూ మన పరిసర ప్రాంతాలపై అవగాహన పొందడం మంచి అలవాటన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లలో విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో సీఐ చక్రధర్‌రావు, ఎస్ఐ రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అప్పన్న నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు

సింహాచలం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మహావిశాఖ అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో ఆదివారం దేవాలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నక్కాన ఆనంద కుమార్‌కు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం కలిపించి శేషవస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

### నేత్రపర్వంగా అప్పన్న నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి నేత్రపర్వంగా ఆర్జిత నిత్యకల్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాల పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, అక్షితారోపణలు జరిపారు.

# రేషన్ పంపిణీలో ఇష్టారాజ్యం!

... 5వ పేజీ తరువాయి

డిపో నంబరు 0386153లో పరిమితికి మించి ఉన్న 129 బస్తాల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ డిపోలో మొత్తం 437 కార్డులు ఉండగా శుక్రవారం సాయంత్రం వరకు 303 కార్డులకు బియ్యం పంపిణీ చేసినట్లు ఆన్‌లైన్‌లో నిర్ధారణ అయింది. విచిత్రమేమిటంటే.. బియ్యం తీసుకున్న 303మందిలో డిపో పక్కనే నివసిస్తున్న వారి సంఖ్య కేవలం 11 కాగా ఇతర ప్రాంతాల వారు 292 మంది ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు తరువాత ప్రతి వలంటీరుకు తన పరిధిలో నివసిస్తున్న 50 మంది కార్డుదారులను అందుబాటులో ఉన్న డిపోలకు మ్యాపింగ్ చేశారు. తొలుత మ్యాపింగ్ చేసిన కార్డుదారులకు సరకులు ఇచ్చి, తరువాత పోర్టబిలిటీ ద్వారా ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాలి. ఇందుకోసం డిపో పరిధిలోని కార్డుదారుల సంఖ్యకు అదనంగా సెకండ్ అలాట్‌మెంట్ ద్వారా సరకులు సరఫరా చేస్తుంటారు. అయితే ఇతర జిల్లాల నుంచి వలసవచ్చిన వారికి బియ్యం పంపిణీలో ఎండీయూలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక్కో డిపో పరిధిలోని కార్డుల సంఖ్యకు అదనంగా 20 నుంచి 30 శాతం పోర్టబిలిటీ కార్డులుంటాయి. పూర్ణామార్కెట్ ఏరియాలో కొందరు డీలర్లు/ఎండీయూలు బియ్యానికి బదులు డబ్బు తీసుకునే వారిని గుర్తించి అక్కడకు వాహనం తరలించి, వేలిముద్రలు తీసుకుంటున్నారు. డిపో సమీపంలోని వారు అడిగితే స్టాకు అయిపోయిందని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో డీలర్లు/ ఎండీయూలకు పౌరసరఫరాల శాఖ పరిధిలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు వత్తాసు పలుకుతున్నారు. కార్డుదారుల నుంచి అక్రమంగా కొనుగోలుచేసిన బియ్యాన్ని ఎండీయూ వాహనాల్లోనే అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా అయితే ఎవరికీ అనుమానం రాదనే ఉద్దేశంతో కొందరు బరి తెగిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

# స్క్రాప్ దుకాణాలపై జీవీఎంసీ దృష్టి

... 5వ పేజీ తరువాయి

అంటుకుని క్షణాల్లో విస్తరించడంతోపాటు పెద్దఎత్తున మంటలు ఎగసిపడి పక్కన ఉండే దుకాణాలు, ఇళ్లకు ప్రమాదం ఉంటుంది.

### నివాసాల మధ్యనే...

నగరంలో వన్‌టౌన్, గాజువాక, మల్కాపురం పరిసరాల్లో జనవాసాలు, పరిశ్రమలకు సమీపంలోనే అత్యధికంగా స్క్రాప్ దుకాణాలున్నాయి. మరికొన్ని ఏకంగా షాపింగ్‌కాంప్లెక్స్‌ల్లో నిర్వహిస్తున్నారు. వాటి గోడౌన్‌లు కూడా దుకాణాలను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలు, రోడ్ల పక్కన ఏర్పాటుచేస్తున్నారు. దీనివల్ల ఎప్పటికైనా ప్రమాదం తప్పదని గుర్తించిన జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ స్క్రాప్ దుకాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించేలా కార్యాచరణ రూపొందించాలని జీవీఎంసీ అగ్నిమాపకశాఖ అధికారిని ఆదేశించారు. దీంతో వారు దుకాణాలకు భద్రతాలోపాలపై నోటీసులు జారీచేస్తున్నారు.

ఇప్పటివరకూ ఐదు దుకాణాలకు జారీచేశామని, త్వరలోనే మిగిలినవాటికి అందజేసి కమిషనర్ సమక్షంలో సమావేశం ఏర్పాటుచేస్తామని జీవీఎంసీ అగ్నిమాపకశాఖ అధికారి వై.హనుమంతరావు తెలిపారు. స్క్రాప్ దుకాణాలకు అనుమతులు జారీచేయడం, పర్యవేక్షించడంలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఎవరికివారు ఇష్టారాజ్యంగా దుకాణాలను ఏర్పాటుచేస్తున్నారన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రైళ్లకు తగ్గని రద్దీ

... 5వ పేజీ తరువాయి

కిక్కిరిశాయి. విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్‌తో పాటు తిరుమల, ప్రశాంతి, మెయిల్, స్వర్ణజయంతి, విశాఖ, గోదావరి, కోణార్క్, ఫలక్‌నూమా, ఎల్‌టీటీ రైళ్లను ఆశ్రయించారు. హౌరా వైపు వెళ్లే రైళ్లకు రద్దీ నెలకున్నది. ఆఫ్‌లైన్‌లో ముందస్తు రిజర్వేషన్ పొంది నిరీక్షణ జాబితాకు పరిమితమైనవారితోపాటు జనరల్ టికెట్ ప్రయాణికులు రిజర్వేషన్ కోచ్‌లను ఆశ్రయించడంతో ఫుట్‌బోర్డు, బాత్‌రూమ్‌ల వద్ద నిలబడి ప్రయాణించాల్సి వచ్చింది.

### ఆర్టీసీకీ ప్రయాణికుల తాకిడి

ద్వారకాబస్‌స్టేషన్: సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో ఆర్టీసీ రద్దీగా మారింది. అంతర్ జిల్లా సర్వీసులతో పాటు, సిటీ బస్సులు ఆదివారం కిటకిటలాడాయి. విశాఖ రీజియన్ నుంచి 150 ప్రత్యేక బస్సులు నడిపారు. హైదరాబాద్‌కు 14, విజయవాడకు 35, భీమవరానికి 2, కాకినాడకు 10, రాజమండ్రికి 30 బస్సులు నడిచాయి. విజయనగరానికి 12, సాలూరు 4, పార్వతీపురం 5, రాజాం 2, శ్రీకాకుళం 20, ఇచ్ఛాపురం 5, పలాస 5, టెక్కలి 2, సోంపేట 3, పర్లాకిమిడి ఒకటి ప్రత్యేక సర్వీసులు వెళ్లాయి. డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు పర్యవేక్షించారు. సోమవారం నుంచి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, ప్రయాణాలు సాఫీగా చేయవచ్చని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

# స్టాఫ్‌నర్సు పోస్టులకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

దళారులు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. తొలుత కొంత మొత్తం చెల్లిస్తే చాలని, పోస్టు వచ్చిన తరువాత మిగిలిన మొత్తం ఇవ్వాలని అభ్యర్థులను ఆశపెడుతున్నారు. ఇటువంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీ సూచించారు. ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని వస్తే వారి వివరాలను తెలియజేయాలని ఆమె కోరారు. మెరిట్ ప్రాతిపదికనే ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఈ విషయంలో అపోహలకు తావులేదన్నారు. మెరిట్ జాబితాను విడుదల చేసిన తరువాత అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని నివృత్తి చేసిన తరువాత తుది జాబితాను వెల్లడిస్తామన్నారు.

# కుదేలైన ప్రాథమిక పాఠశాలలు

... 5వ పేజీ తరువాయి

ఆయా పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యాబోధన సజావుగా సాగదని, భవిష్యత్తులో పాఠశాల ఎత్తివేస్తారన్న అనుమానంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. 3,4,5 తరగతుల పిల్లలను ఉన్నత పాఠశాలలకు పంపడంపైనా విముఖత చూపారు. దీంతో తరువాతి ఏడాదికి ప్రాథమిక పాఠశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గింది. ఈ ఏడాది మరింతగా తగ్గడంతో 54 పాఠశాలల్లో పది మంది కంటే తక్కువగా విద్యార్థులున్నారు.

**జీవోను రద్దుచేసిన ప్రభుత్వం:** కూటమి ప్రభుత్వం జీవో 117 రద్దుచేసింది. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు మారుస్తామని ప్రకటించింది. ప్రతి పంచాయతీలో 60 మంది పిల్లలున్న పాఠశాలను మోడల్‌గా మార్చుతామని, తక్కువ ఉంటే బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగిస్తామని తెలిపింది. తక్కువ సంఖ్యలో పిల్లలున్న పాఠశాలల్లో 1, 2 తరగతులను మాత్రమే కొనసాగించి 3, 4, 5 తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాలలకు మార్చినా ప్రైమరీ పాఠశాలల మనుగడకు ముప్పు తప్పదని ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు. ప్రాథమిక విద్యావ్యవస్థను సరైన దారిలో పెట్టాలన్నారు.

## ఇంటర్వ్యూ..

### ఆర్థిక ప్యాకేజీతో ప్లాంటులో ప్రగతి సాధ్యం

-కేఎస్ఎన్ రావు, స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు



స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం మంచి శుభపరిణామమని ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు తెలిపారు. ఆర్థిక ప్యాకేజీతో ఉక్కు కర్మాగారంలోని అన్ని విభాగాల్లో పూర్తి స్థాయి ఉత్పత్తి జరిగేందుకు అవకాశం ఉందని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. తద్వారా ప్లాంట్ మంచి లాభాల్లో నడుస్తుందని పేర్కొన్నారు.

**ప్రశ్న:** స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వ చర్యలు ఎలా ఉన్నాయి?

**జవాబు:** ప్లాంట్ విషయంలో ఎన్‌డీఏ కూటమి తీసుకున్న ప్యాకేజీ చర్య బాగుంది. రాష్ట్రంలో కూటమి నాయకత్వం కేంద్రంపై ఒత్తిడి తేవడం వల్లే స్టీల్ ప్లాంటుకు మంచి ప్యాకేజీ వచ్చింది.

**ప్ర:** ప్లాంట్ మనుగడకు శాశ్వత పరిష్కారం ఏమిటి?

**జ:** స్టీల్‌ప్లాంట్ మనుగడకు సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం వంటి చర్యలు చేపట్టాలి. సెయిల్‌లో 'ఉక్కు'ను కలిపితే అగ్రగామిగా నిలుస్తుంది.

**ప్ర:** ఉద్యోగులు, కార్మికుల విషయంలో మీ డిమాండ్ ఏమిటి?

**జ:** ఉక్కు కర్మాగారాన్ని పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలి. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి. పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలి. యాజమాన్యం తీసుకునే చర్యలకు సంపూర్ణ సహకారం అందిస్తాం.

### ఏఐవైఎఫ్ నిర్మాణ మహాసభ

పెందుర్తి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభను ఆదివారం పెందుర్తిలో నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి మహంకాళి సుబ్బారావు హాజరై సంస్థ స్థాపన, సిద్ధాంతం, లక్ష్యం, పోరాటం, లక్ష్య ఛేదన అంశాలను వివరిస్తూ.. యువత సమస్యలపై నిరంతరం నిర్మాణాత్మకంగా పోరాటం చేసేది ఏఐవైఎఫ్ మాత్రమేనని అన్నారు. తొలుత యువజన నేత క్షేత్రపాల్ ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వైరాంబాబు వార్షిక సమీక్ష నివేదికను ప్రవేశపెట్టారు.

### త్యాగరాజ ఆరాధనోత్సవం

పెందుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాన్ని సప్త స్వరాల సంగీత అకాడమీ నిర్వాహకురాలు, సంగీత విద్వాంసురాలు కొత్తపల్లి భానుమతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఘనంగా నిర్వహించారు.

### సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

### రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 16, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 30, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 54 దొండకాయలు 42, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 320, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 36, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 58, దేముడుచిక్కుడు 62, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 32, బ్రకోలి 80, నూల్ కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

| కోడిగుడ్లు (నెక్) | |
|---|---|
| (వంద - రూ.లలో) | |
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 125 |
| లైవ్ ధర | 145 |
| విత్ స్కిన్ | 260 |
| స్కిన్‌లెస్ | 270 |

# గోవుల తరలింపునకు అడ్డాగా పెందుర్తి!

**పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్న మూగజీవాల సంరక్షకులు**

**పెందుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** ఇటీవల విజయనగరం జిల్లా మానాపురం నుంచి రెండు కంటైనర్లలో అక్రమంగా చెన్నైకు గోవులను తరలిస్తున్నట్టు గుర్తించడంతో పలువురు గోరక్షకులు ఆందోళన చెందుతున్నారు. పెందుర్తిలో 37 గోవులను గుర్తించి భోగాపురంలోని గోశాలకు తరలించిన విషయం తెలిసిందే. గత సంఘటనలను గమనిస్తే.. గోవుల తరలింపునకు పెందుర్తి ప్రాంతం అడ్డాగా మారింది. ఇక్కడి నుంచి మూగజీవాల తరలింపుపై ఇటీవల కాలంలో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. పెందుర్తిలో గట్టి నిఘా లేకపోవడంతో గోవుల తరలింపునకు అడ్డుకట్ట లేకుండా పోతుంది. కోల్‌కత్తా-చెన్నై మధ్య పెందుర్తి ప్రధాన మార్గం కావడంతో కంటైనర్లలో గోవులను తరలిస్తున్నారు. వాహనాల్లో అధిక సంఖ్యలో వీటిని బంధించడంతో ఉక్కిరిబిక్కిరై అల్లాడుతున్నాయి. కొన్ని ఘటనల్లో పలు గోవులు మృతి చెందుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గోవుల తరలింపు యథేచ్ఛగా సాగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడప్పుడు గో సంరక్షకుల సమాచారంతో వీటి రవాణాను అడ్డుకుంటున్నా, పోలీసుల కళ్లుగప్పి తరలించడం మామూలైంది. పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడితే అక్రమార్కుల ఆట కట్టించవచ్చు. కానీ వారు అప్పుడప్పుడు మాత్రమే ఈ పని చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల బొలేరో వాహనంలో గోవులను బంధించి అర్థరాత్రి పెందుర్తి మీదుగా తమిళనాడుకు తరలిస్తుండగా మూగజీవాల సంరక్షకులు గుర్తించి పోలీసు ఉన్నతాధికారులకు తెలపడంతో గోవుల తరలింపునకు అడ్డుకట్ట పడింది. గతంలో ఓ కంటైనర్‌లో ప్యాకింగ్ చేసిన గో మాంసాన్ని యూపీ తరలిస్తుండగా పెందుర్తి పోలీసులు పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పాలు ఇవ్వని గోవుల వల్ల ఆదాయం రాకపోవడంతో వాటిని వదిలించుకునే ప్రయత్నంలో సంబంధిత యజమానులు కబేళాలకు తరలిస్తున్నారని పోలీసులు అంటున్నారు. ఇప్పటికైనా గోవుల తరలింపునకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మూగజీవాల సంరక్షకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వాహనంలో గోవులను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

## ఉత్సాహభరితంగా పరసలు



యల్లపువానిపాలెంలో పూజలందుకున్న సీతారాములు

గోపాలపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ఆలయాల వద్ద పరసలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడి యల్లపువానిపాలెంలో సీతారాముల ఆలయ తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సీతారాములను శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం జరిగిన పరస కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

**చీమలాపల్లిలో రోళ్ల పైడిమాంబ..**

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి, పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ పరసను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనార్థం ఆలయానికి తరలివచ్చారు. రోళ్ల పైడిమాంబకు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ధర్మకర్త అయితా ఎర్నిబాబు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన బుర్రకథ ప్రదర్శన అందరికీ అమితంగా ఆకట్టుకుంది.

**కొత్త నక్కవానిపాలెంలో కోదండ రామస్వామి..**

మల్కాపురం: గ్రేటర్ 59వ వార్డు పరిధి కొత్త నక్కవానిపాలెంలో కోదండ రామస్వామి పరసను నిర్వహించారు. ఉదయం నుంచే కోదండ రాముడ్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

**అండమాన్ కొండయ్యవలసలో..**

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అండమాన్ కొండయ్యవలస రామాలయం వద్ద సీతారాముల పరసను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో బాలగణపతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగారిడీలు, బొమ్మలకొలువు, తదితరమైనవి అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాము వసంతరావు, బలిరెడ్డి శ్రీను, బి.అప్పారావు, పి.కొండలరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.



అండమాన్ కొండయ్యవలస పరసలో భజన నిర్వహిస్తున్న భక్తులు



ఇంద్రసేనారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## త్రిపుర గవర్నర్‌కు ఆత్మీయ వీడ్కోలు

గోపాలపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర పర్యటనను ముగించుకుని తిరిగి ప్రయాణమైన త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి బీజేపీ నగర నాయకులు విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఇంద్రసేనారెడ్డికి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాలరాజేశ్వరరావు, పృథ్వీరాజ్, తదితరులు వీడ్కోలు చెప్పారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి త్రిపుర బయలుదేరి వెళ్లారు.

## సామాజిక అంశాలపై పోరాడుతున్న ఘనత మాదే..

**బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు**



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంవీఎస్ నాయుడు, తదితరులు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మికుల సమస్యలపై పోరాటం చేయడంతో పాటు మహిళా సాధికారిత, పర్యావరణ పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై పోరాడుతున్న ఘనత బీఎంఎస్‌కే దక్కుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు అన్నారు. బీఎంఎస్ 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భెల్ హెచ్‌పీవీపీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన యూనియన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో దేశంలో చేపడుతున్న కార్మిక సంక్షేమ కార్యక్రమాలు జిల్లాలో ఉన్న ప్రతి కార్మికుడికి తెలిసేలా గృహ సంపర్క్ అభియాన్‌ను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రొక్కం సురేశ్‌కుమార్, లోవరెడ్డి, లాలం ప్రసాద్, ఎస్.రామచంద్ర చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క స్వైరవిహారం: ఇద్దరికి తీవ్ర గాయాలు

**అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్న జైఆంధ్ర కాలనీ, చింతలలోవ, కాకరలోవ ప్రాంతాల ప్రజలు**



చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ రమణ

సింధియా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడి చేసి కరవడంతో ఆదివారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 63వ వార్డు పరిధి జైఆంధ్ర కాలనీ, చింతలలోవ, కాకరలోవ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తుంది. రోడ్డున రాకపోకలు సాగించే వారందరినీ ఈ కుక్క భయభ్రాంతులకు గురి చేస్తుంది. ఆదివారం ఉదయం కాకరలోవ ఆటో స్టాండ్ వద్ద వై.రమణ అనే ఆటో డ్రైవర్ ప్రయాణికులను ఎక్కించేందుకు తన వాహనాన్ని సిద్ధం చేస్తుండగా వెనక నుంచి వచ్చిన పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచింది. రమణ కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో స్థానికులు సమీపంలో గల ఓ ఆస్పత్రికి తరలించారు. గాయమైన చోట వైద్యులు ఆరు కుట్లు వేసినట్టు రమణ తెలిపారు. అలాగే సాయంత్రం కాకరలోవలో నడిచి వెళుతున్న యాభై ఏళ్ల మహిళను పిచ్చికుక్క తీవ్రంగా గాయపరచడంతో ఆమెను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. ఇటీవల నలుగురి మహిళలపై ఈ కుక్క దాడి చేయడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. గత పది రోజుల్లోనే సుమారు పదిమంది పిచ్చికుక్క బారినపడ్డారని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా ఇక్కడ పాఠశాలలు ఉన్నందున విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పిచ్చికుక్క వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అందువల్ల అధికారులు స్పందించి వాటి నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## 'పల్లా'ను కలిసిన ఉక్కు ఉద్యమ నేత మనవడు



పల్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మోహన్‌గాంధీ, తదితరులు

గాజువాక, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారానికి మంచి ఆర్థిక ప్యాకేజీ కేంద్రం ప్రకటించేందుకు విశేష కృషి చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఉక్కు ఉద్యమ నేత అమృతరావు మనవడు టి.మోహన్‌గాంధీ, కార్మిక సంఘ నాయకులు ఆదివారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం నాడు అమృతరావు ఎంతో కృషి చేశారని, అటువంటి ప్లాంటుకు పూర్వ వైభవం తీసుకురావాలని మోహన్‌గాంధీ కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకుడు విల్లా రామ్మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి అందరూ సహకరించండి

**60వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్**

మల్కాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధాన్ని జీవీఎంసీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుందని, అందువల్ల ప్రజలందరూ తమకూ సంపూర్ణ సహకారాన్ని అందించాలని 60వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ కోరారు. ప్లాస్టిక్ నిషేధంపై ఆదివారం ఆయన శ్రీహరిపురం ప్రాంతంలో వ్యాపారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నిషేధించినందున వాటికి ప్రత్యామ్నాయంగా క్లాత్, నార సంచులను వినియోగించాలని.. తద్వారా పర్యవరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయించినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**8 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం**

**సింధియా:** ప్లాస్టిక్ నివారణలో భాగంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జోన్-5 జోనల్ కమిషనర్ రాము ఆధ్వర్యంలో 40, 63 వార్డుల్లో, హిందుస్థాన్ షిప్‌యార్డ్ మార్కెట్‌లో ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ విక్రయించిన వారిపైనే కాకుండా వినియోగించిన వారికి కూడా జరిమానా విధిస్తామన్నారు. అందువల్ల వ్యాపారులు, ప్రజలు నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వాడకానికి దూరంగా ఉంటూ స్వచ్ఛ విశాఖగా నగరాన్ని తీర్చిదిద్దాలన్నారు. దాడుల్లో భాగంగా ఎనిమిది కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నట్టు రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు సత్తిబాబు, నసీమా బీబీ, పారిశుధ్య సిబ్బంది కొండబాబు, మణి, మార్కెట్ వర్తక సంఘం కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



షిప్‌యార్డ్ మార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెదగంట్యాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదవుకోవాలని, ఇందుకోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీతి కథలు, విజ్ఞానం, వినోదం, సాంకేతిక, పరిశోధనాత్మక అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదవడం వల్ల సమాజ స్థితిగతులు అర్థమవుతాయన్నారు. అనంతరం పాఠకులతో చదవడం మాకిష్టం అంటూ ఆయన ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక నాయకులు, పాఠకులు పాల్గొన్నారు.

## విద్యా వికాస కేంద్ర నిర్వాహకులకు శిక్షణ

పెందుర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి క్రైట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో ఆదివారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో గల 30 గ్రామాల్లో నిర్వహిస్తున్న విద్యా వికాస కేంద్ర నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యా వికాస కేంద్రాలతో గ్రామాల్లో శత శాత అక్షరాసత్య సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, జిల్లా సమన్వయకర్తలు వనజ,గౌరీనాయుడు, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్లపువానిపాలెం జడ్పీ హై స్కూల్ సమీపంలో గోతులమయమైన రోడ్డు

## పైపు లైన్ లీకేజీతో ఛిద్రంగా మారుతున్న రోడ్డు

గోపాలపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): భూగర్భ పైపు లైన్ లీకేజీ కారణంగా రహదారి ఛిద్రంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. 89వ వార్డు పరిధి ఎల్లపువానిపాలెం జడ్పీ హైస్కూల్ సమీపంలో ఎంఈఎస్ (మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్)కు చెందిన భూగర్భ తాగునీటి పైపు లైన్ రెండు నెలల నుంచి లీక్ అవుతుంది. అయితే మరమ్మతులు చేపట్టకపోవడంతో పైపు లైన్ లీకవుతున్న చోట రోడ్డు గోతులమయంగా మారింది. దీంతో ఈ మార్గం నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు**

**26న తలపెట్టిన భారీ మానవహారం వాయిదా**

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్రం ముందుకు రావాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. ఏఐటీయూసీ ప్లాంట్ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన పోరాట కమిటీ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ప్యాకేజీ శాశ్వత పరిష్కారం కాదని, తక్షణ కర్తవ్యంగా కొంత ఉరట కలిగించే ప్యాకేజీ వల్ల కలుగుందన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు యాజమాన్యం ముందుకు రావాలన్నారు. ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసి కోరుతామని, ప్యాకేజీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపుతామని పేర్కొన్నారు. అదే విధంగా ఈ నెల 26న కూర్మన్నపాలెం నుంచి జింక్ గేటు వరకు తలపెట్టిన మానవహారాన్ని వాయిదా వేశామన్నారు. సమావేశంలో నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, బీఎన్ రాజు, వీవీ రమణమూర్తి, యు.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## బీమా రంగం బలోపేతానికి ఐసీఈయూ కృషి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ)తో పాటు అన్ని వర్గాల ప్రజలు సమాయత్తం కావాలని ఐసీఈయూ ఉపాధ్యక్షుడు రత్నకుమార్ అన్నారు. గాజువాకలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీని మరింత బలోపేతం చేసేందుకు యాజమాన్యంతో పాటు ఐసీఈయూ సోమవారం నిర్వహిస్తున్న మేడ్ మిలియన్ డేను ఉద్యోగులతో పాటు డెవలప్‌మెంట్ అధికారులు, ఏజెంట్‌లు విజయవంతం చేసేందుకు కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్యాకేజీపై కూటమి సంబరాలు



వడ్లపూడిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుకు రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించడాన్ని పురస్కరించుకుని ఆదివారం 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, ఉక్కు నిర్వాసితులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బొండా జగన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుల సమష్టి కృషి వల్లే కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాస్, ఇల్లపు ప్రసాద్, టీడీపీ 86వ వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ, కూటమి నాయకులు సిరసపల్లి కనకరాజు, ఎల్.సోంబాబు, ఎస్ఎస్ విజయరామరాజు, ఎం.రాము, తదితరులు పాల్గొన్నారు.

**చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఫ్లెక్సీకి పాలాభిషేకం**

**పెదగంట్యాడ:** స్టీల్ ప్లాంటుకు కేంద్రం రూ.11,440 కోట్ల నిధులు ప్రకటించడం అభినందనీయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం కూటమి నాయకులు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెదగంట్యాడ కూడలిలో జరిగిన సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తూ నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. నాయకులు పెద్దాడ సోమునాయుడు, నమ్మి అప్పారావు, పెరుమాళ్ల, ఎం.పెంటయ్య, శ్రీముసిరి శ్రీనివాసరావు, కిలాని ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

**కేంద్రం సహకారంతో ప్లాంటుకు మంచి రోజులు**

**ఉక్కుటౌన్‌షిప్:** కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్టీల్‌ప్లాంటుకు త్వరలోనే మంచి రోజులు వస్తాయని బీజేపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామ్మూర్తి అన్నారు. టౌన్‌షిప్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంటును ఆదుకునేందుకు కేంద్రం ముందుకు వచ్చిందని, ఈ అవకాశాన్ని ఉక్కు ఉద్యోగులు సద్వినియోగం చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేడు సర్వీస్ ప్రొవైడర్స్ మేళా

వేపగుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ వేపగుంట జోన్-8 కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మెప్మా, హోమ్ ట్రయాంగిల్ ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్ మేళా నిర్వహిస్తున్నట్టు ఏపీడీ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తులు, విద్యుత్, మోటార్, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, వాషింగ్, గ్రీజర్, రిఫ్రిజిరేటర్ టెక్నీషియన్స్‌కు సంబంధించిన వారంతా తమ బయోడేటాను తీసుకువస్తే ఈ-కామర్స్ ప్రొవైడర్స్‌తో అనుసంధానం కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాలిథిన్ కవర్లను వినియోగించవద్దంటూ ర్యాలీ

కూర్మన్నపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి చేపలు, మాంసం మార్కెట్‌లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాలిథీన్ కవర్లను వినియోగించరాదంటూ తిరుమల నగర్ కాలనీ వాసులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చేపలు, మాంసం కొనుగోలు కోసం స్టీల్ బాక్సులు లేదా, క్లాత్ సంచులు, నారసంచులను తీసుకురావాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించి భావితరాల భవిష్యత్తును పాడు చేయరాదంటూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి ఎం.పరమానందం మాట్లాడుతూ పూర్తి స్థాయిలో పాలిథీన్‌ను ప్రజలు నిషేధించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.